# అల్లు అర్జున్ ఇంటిపై దాడి

- పూల కుండీలు ధ్వంసం, అడ్డువచ్చిన సిబ్బందిపై దౌర్జన్యం
- ఓయూ జేఏసీ ముసుగులో యూత్ కాంగ్రెస్ నేతల అరాచకం
- కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు, నిందితుల అరెస్ట్
- అభిమానులు సంయమనం పాటించాల్సిన సమయమిది: అరవింద్

సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటి ఆవరణలో పూలకుండీలను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్ డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్: శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి అల్లు అర్జున్‌పై విమర్శలు చేయడం, తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం జరుగుతున్నదని అల్లు అర్జున్ ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆదివారం మరోసారి ఉద్రిక్తత పరిస్థితి తలెత్తింది. జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటిపై 10మంది యువకులు దాడి చేశారు. ఓయూ జేఏసీ నేతలుగా చెప్పుకుంటూ గేట్లను తోసుకుంటూ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న సిబ్బందిని చితకబాదారు. ఆవరణలోని పూలకుండీలను ధ్వంసం చేశారు. అల్లు అర్జున్ ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. అల్లు అర్జున్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వచ్చి యువకులను అరెస్ట్ చేశారు. అల్లు అరవింద్ మేనేజర్ కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన యువకులను చౌటుప్పల్‌కు చెందిన నాగరాజ్, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నగేశ్, కొడంగల్ నియోజకవర్గానికి చెందిన రెడ్డి శ్రీనివాస్ , మోహన్, చర్లపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్ , షాద్‌నగర్‌కు చెందిన ప్రకాశ్‌గా పోలీసులు తెలిపారు. దాడి నేపథ్యంలో అల్లు అర్జున్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు, సమీపంలో పికెట్ ఏర్పాటు చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై అల్లు అర్జున్ సిబ్బంది దాడి చేశారని యువకులు చెప్పారు.

అల్లు అర్జున్ ఇంటిపై దాడిలో పాల్గొన్న నిందితులు రెడ్డి శ్రీనివాస్, ముక్క ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌గౌడ్, నాగరాజు వీరేనని, రేవంత్‌రెడ్డితో కలిసి ఫొటోలు దిగారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

### ఓయూ జేఏసీ నేతలు కాదు: పోలీసులు

దాడికి పాల్పడిన వారు ఓయూ జేఏసీ పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. కానీ వాళ్లు ఓయూ జేఏసీ నేతలు కాదని పోలీసులు స్పష్టంచేశారు. దాడిలో కీలకపాత్ర పోషించిన రెడ్డి శ్రీనివాస్ కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్తించారు. 2019లో కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా కూడా పోటీ చేశాడని, అతడు సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తుంటాడని తెలుస్తున్నది. మిగిలిన యువకులు కూడా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్నారని సమాచారం. మరోవైపు దాడిలో పాల్గొన్న రెడ్డి శ్రీనివాస్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. మళ్లీ 1500మందితో వచ్చి దాడి చేస్తామని ఆ వీడియోలో హెచ్చరించాడు.

### ఇళ్లపై దాడిని సహించం: సీఎం రేవంత్‌రెడ్డి

సినీ ప్రముఖుల ఇళ్లపై దాడిని సహించబోమని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడిని ఖండిస్తూ సీఎంవో నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా డీజీపీ, నగర సీపీని ఆదేశించారు. సంధ్య థియేటర్ ఘటనలో సంబంధం లేని పోలీసు సిబ్బంది స్పందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### అర్జున్ పిల్లలను తీసుకెళ్లిన తాత

అల్లు అర్జున్ ఇంటికి వచ్చిన ఆయన మామ ప్రభాకర్‌రెడ్డి మనుమడు అయాన్ మనుమరాలు అర్హను వెంట తీసుకెళ్లారు. దాడి ఉద్రిక్తతల నేపథ్యంలోనే వారిని తీసుకెళ్లినట్టు తెలుస్తున్నది.

### సంయమనం పాటించాలి

జరుగుతున్న ఘటనలను ప్రజలంతా చూస్తున్నారు. ఇలాంటి సమయంలో అభిమానులు సంయమనం పాటించాలి. మేం కూడా సంయమనం పాటిస్తున్నాం. దాడి గురించి తెలిసిన వెంటనే పోలీసులు వచ్చి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. దాడి చేసిన వారిపై కేసులు పెట్టారు. ఇంటి దగ్గర ఎవరు గొడవ చేసినా తీసుకువెళ్లేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు.

- అల్లు అరవింద్, అల్లు అర్జున్ తండ్రి

## ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే రీల్స్ కట్ అవుతాయి

- ఏసీపీ విష్ణుమూర్తి

ఖైరతాబాద్, డిసెంబర్ 22: పోలీసులపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే వారి రీల్స్ కటవుతాయని సస్పెన్షన్‌లో ఉన్న ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'ముద్దాయి ప్రెస్‌మీట్ ఎలా పెడుతారు? పోలీసులను తీవ్ర పదజాలంతో ఇబ్బందులు పెడితే ఎక్కడికక్కడ కట్ చేస్తాం'అని హెచ్చరించారు. ఏసీపీ విష్ణుమూర్తి వ్యాఖ్యలపై సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన విష్ణుమూర్తి సస్పెన్షన్‌కు గురికాగా, ఆయనను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు పేర్కొన్నారు. డీజీపీ కార్యాలయం నుంచి విచారణ జరిపిస్తున్నారని, విష్ణుమూర్తిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌పాలనలో శాంతిభద్రతలు కరువు

- ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువవయ్యాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఏడాది కాలంలో హైదరాబాద్‌లో 35,944 నేరాల కేసులు నమోదు కావడం రాష్ట్రంలో దిగజారిన పరిస్థితులకు అద్దం పడుతున్నదని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడి దృశ్యాలను పోస్ట్ చేశారు. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. హత్యలు, అత్యాచారాలు, దాడులు జరుగుతుండడం వల్ల ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో శాంతిభద్రతలు లేవనే విషయం స్పష్టమవుతున్నదని ఎద్దేవా చేశారు. హోంశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా అడుగంటుతున్న శాంతి భద్రతలపై తక్షణం చర్యలు తీసుకుని, ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టాలని డిమాండ్ చేశారు.

## అల్లు అర్జున్‌పై సీఎంకు కక్ష ఎందుకు?

- మజ్లిస్‌తో కలిసి సీఎం కుట్రపూరితంగా వ్యవహరించారు
- బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సినీనటుడు అల్లు అర్జున్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరించిన తీరు ఏమాత్రం భావ్యం కాదని బీజేపీ బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్ తప్పుబట్టారు. విద్వేషపూరితంగా, కక్ష గట్టినట్టుగా వ్యవహరించడం ఏమాత్రం మంచిదికాదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి, మజ్లిస్ పార్టీ కుట్రపూరితంగానే అల్లు అర్జున్‌ను, సినీపరిశ్రమను అపఖ్యాతి పాలు చేసేందుకు అసెంబ్లీని వేదికగా మలచుకున్నారని ఆరోపించారు. అల్లు అర్జున్‌పై అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరముందా? అని తెలుగు రాష్ట్రాల ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. తెలుగు సినీపరిశ్రమ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందని, తెలుగు ప్రజలు గర్వించే సినిమాలు వస్తున్నాయని చెప్పారు.

కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

## చట్టం ముందు అంతా సమానమే

- డీజీపీ జితేందర్

కరీంనగర్ రాంనగర్, డిసెంబర్ 22 : చట్టం ముందు అందరూ సమానమేనని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. సినీ ప్రముఖులు అల్లు అర్జున్, మోహన్ బాబు విషయాల్లో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని తెలిపారు. సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. లైంగిక వేధింపులకు గురైన, అసభ్యకరమైన ప్రవర్తనకు లోనైన పిల్లలకు సురక్షితమైన వాతావరణంలో చే యూత అందించేందుకే పోలీసు శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కమిషనరేట్లు, జిల్లాల్లో భరోసా కేంద్రాలను ఏర్పా టు చేస్తున్నదని తెలిపారు. లైంగిక వేధింపుల కేసుల్లో శిక్షల శాతం పెరిగిందని చెప్పారు.

## ప్రభుత్వమే అసలు ముద్దాయి

- స్మగ్లింగ్ కథకు రాయితీలా?
- సీపీఐ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఎర్ర చందనం స్మగ్లింగ్ లాంటి క్రూరమైన దొంగ వ్యాపారాన్ని గౌరవంగా చూపిస్తూ తీసిన సినిమాకు రాయితీలు ప్రకటించి, ప్రజలపై భారం మోపిన తెలంగాణ ప్రభుత్వం అసలైన ముద్దాయి అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. ఏదైనా సందేశాత్మక చిత్రానికి రాయితీలు ఇవ్వవచ్చు కానీ పుష్ప వంటి సినిమాకు ఇవ్వడమేంటని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తొక్కిసలాటలో మహిళ చనిపోయిన ఘటనపై చౌకబారు ప్రచారానికి సినిమా వాళ్లు పాల్పడవచ్చేమో గానీ రాజకీయ నాయకులు కక్కుర్తి పడడమేంటని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన ప్రభుత్వమే రాజకీయాలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రగతిశీల కళాకారులు, సాహితీవేత్తలు, సామాజిక స్పృహ ఉన్న వారంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధిత కుటుంబానికి పుష్ప టీం ఇచ్చే ఆర్థిక సాయాన్ని తిరస్కరించాలని, ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే తమ వంతు సాయం కూడా ప్రకటిస్తామని వెల్లడించారు.

## అల్లు అర్జున్ ఇంటిపై దాడి హేయం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు దాడి చేయడం హేయమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత కక్షలకు పోతూ అల్లు అర్జున్‌పై కాంగ్రెస్ నేతలను ఉసిగొల్పుతూ దాడులు చేయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ముఖ్యమంత్రే విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాలల్లో 54మంది విద్యార్థులు చనిపోయినా ఏనాడూ మాట్లాడలేదని మండిపడ్డారు.

## అమెరికాలో మాదన్నపేటవాసి మృతి

వంశీ (ఫైల్)

కమలాపూర్, డిసెంబర్ 22: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన బండి వంశీ(26) అనుమానాస్పదస్థితిలో అమెరికాలో మృతి చెందాడు. వంశీ ఏడాది క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి కాంకోర్డియా సెయింట్ పాల్ వర్సిటీలో చదువుతున్నాడు. వంశీ మృతి విషయం తల్లిదండ్రులకు శనివారం రాత్రి తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

## చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ బోగీలో పొగలు

గద్వాల అర్బన్, డిసెంబర్ 22 : కాచిగూడ నుంచి చెన్నై వెళ్లే ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ గద్వాలకు చేరుకున్న సమయంలో ఓ బోగీలో దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు వెంటనే ప్రయాణికులను దింపివేశారు. చక్రాల దగ్గర ఉండే రబ్బర్ అరిగిపోవడంతో రాపిడికి మంటల వచ్చినట్టు అధికారులు గుర్తించారు.

# ఫస్టియర్‌లోనే థియరీ

- సెకండియర్‌లో స్కిల్స్ బేస్డ్ లెర్నింగ్
- థర్డియర్‌లో ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్
- డిగ్రీకి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిన ఉన్నత విద్యామండలి
- సిలబస్, కోర్సుల స్వరూపంలో సమూల మార్పులు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మొదటి సంవత్సరంలో థియరీ క్లాసులు, రెండో సంవత్సరంలో స్కిల్లింగ్.. మూడో సంవత్సరంలో అనుభవపూర్వకమైన అభ్యసనం(ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్). ఇలా వినూత్నంగా డిగ్రీ కోర్సులను కొత్తపుంతలు తొక్కించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. డిగ్రీ కోర్సుల స్వరూపంలో సమూల మార్పులు చేసింది. పూర్తిగా తరగతి బోధన విధానానికి ముగింపు పలకనుంది. విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకుంటున్నారు కానీ ఉద్యోగాలు మాత్రం లభించడం లేదు. కేవలం అడ్మిషన్ దొరికితే చాలు. పరీక్షలు రాస్తే సరి. మూడేండ్లల్లో డిగ్రీ సర్టిఫికెట్ చేతికొచ్చేస్తుంది. ఫలానా కోర్సు పూర్తిచేస్తే.. ఫలానా కొలువు లభిస్తుందన్న గ్యారెంటీని మన విద్యావిధానం ఇవ్వలేకపోతున్నది. దీంతో కాలేజీలు నిరుద్యోగులను తయారు చేసే కార్ఖానాల్లా తయారయ్యాయి. ఈ విధానానికి ముగింపు పలికేందుకు ఉన్నత విద్యామండలి చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చింది. ఇందుకోసం కామన్ కరిక్యులాన్ని సిద్ధంచేస్తున్నది. ఇప్పుడున్న సిలబస్‌లో భారీ మార్పులు చేస్తూ.. 30శాతం మార్చనుంది. 2025 మార్చిలోపు కామన్ కరిక్యులాన్ని సిద్ధం చేసి, జూన్‌లో ప్రవేశపెట్టనుంది.

### రోడ్‌మ్యాప్‌లోని ముఖ్యాంశాలు..

- రాష్ట్రంలోని అన్ని పబ్లిక్ యూనివర్సిటీలకు కామన్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్, కామన్ క్రెడిట్ సిస్టంను అమలు చేస్తారు. క్రెడిట్స్‌ను ఒక వర్సిటీ నుంచి మరో వర్సిటీకి మార్చుకునే వెసులుబాటును కల్పిస్తారు.
- యూజీ ప్రోగ్రాముల్లో మూడో సెమిస్టర్ నుంచే పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలను నేర్పిస్తారు. వొకేషనల్ ఎడ్యుకేషన్ మాడ్యూల్స్‌ను ప్రవేశపెడతారు.
- డిగ్రీ కోర్సుల్లో పరిశ్రమలు ఆశించిన (ఇండస్ట్రీ ఒరియెంటెడ్) కరిక్యులాన్ని ప్రవేశపెడతారు. విద్యార్థులు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.
- అంత్రప్రెన్యూర్‌షిప్‌ను అభివృద్ధి చేసేందుకు టీహబ్‌లో, బయో సైన్సెస్ కోసం ఐకేపీ నాలెడ్జ్‌పార్క్‌లను ఇండస్ట్రీ స్పెసిఫిక్ క్లస్టర్లను ఏర్పాటు చేస్తారు. ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తారు.
- రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అసమానతలను రూపుమాపేందుకు స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్స్(ఎస్ఈజెడ్)ను ఏర్పాటు చేస్తారు. వీటిని విద్యాపరంగా వెనుకబడిన జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు.
- విదేశీ వర్సిటీల సహకారంతో డ్యూయల్ డిగ్రీ, జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్స్‌ను ఆఫర్ చేస్తారు. ప్రతి వర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తారు.
- ఆన్‌లైన్ యూజీ, పీజీ ప్రోగ్రాములను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకొస్తారు. కమ్యూనిటీ బేస్డ్ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహించినా, ఈ కోర్సుల్లోని వారికి ఇంటర్న్‌షిప్‌లుంటాయి. దీంతో విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కోర్సుల అధ్యయనంతోపాటు ఇంటర్న్‌షిప్‌ల ద్వారా సంపాదిస్తారు.
- రాష్ట్రంలో అత్యధికులు స్కాలర్‌షిప్‌ల ఆధారంగా చదువుకుంటున్నారు. స్కాలర్‌షిప్‌ల ద్వారానే విద్యార్థులకు చదువు అందుతున్నది. దీనిని సమూలంగా మార్చుతారు. అంతర్జాతీయ వర్సిటీలతో ఒప్పందాలు చేసుకుంటారు.

మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న మద్యం ప్రియులు

## మద్యం ప్రియులకు పనిష్మెంట్

- ప్రభుత్వ దవాఖానలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 22: మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన 11 మంది మద్యంప్రియులకు మూడురోజులపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మంచిర్యాల కోర్టు జడ్జి (ఫస్ట్ అడిషనల్ మెజిస్ట్రేట్) ఉషనిషధ్వని శనివారం శిక్ష విధించారు. ఆదివారం మందమర్రి పోలీసులు వారితో మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేయించారు.

పౌరహక్కుల సంఘం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మావోయిస్టు బాధిత కుటుంబాలు

## మావోయిస్టు బాధిత కుటుంబాల ధర్నా

ఏటూరునాగారం, డిసెంబర్ 22 : మావోయిస్టులు, పౌరహక్కుల సంఘాలకు వ్యతిరేకంగా మావోయిస్టు బాధిత కుటుంబాలు ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారిపై ధర్నా చేపట్టి పౌరహక్కుల సంఘం దిష్టిబొమ్మను దహనం చేశారు. గత నెల 21న రాత్రి వాజేడు మండల కేంద్రంలో ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసిన పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్, ఎడ్ల కాపరి ఉయిక అర్జున్ కుటుంబాలతో పాటు అంతకుముందు వెంకటాపురం మండలంలో బాంబు పేలిన ఘటనలో కాళ్లు కోల్పోయిన సునీత, ఇతర బాధిత కుటుంబాల సభ్యులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ నెల ఒకటిన ఏటూరునాగారం మండలం చెల్పాక ఎన్ కౌంటర్‌లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందిన విషయం తెలిసిందే. పౌర హక్కుల సంఘాల నాయకులు ఆదివారం ఎన్ కౌంటర్ జరిగిన ఘటనా స్థలానికి వస్తున్నట్టు తెలుసుకున్న రమేశ్, అర్జున్ కుటుంబ సభ్యులు వారిని అడ్డుకునేందుకు ఏటూరునాగారం వచ్చారు. మావోయిస్టులచేత హత్య చేయబడిన బాధిత కుటుంబాలను పరామర్శించేందుకురాని పౌరహక్కుల సంఘం నాయకులు మావోయిస్టులు చనిపోతే రావడం ఏమిటని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

## అన్నంలో విషం పెట్టి కాల్చి చంపారు

- చెల్పాక ఎన్‌కౌంటర్ బూటకం
- సిట్టింగ్‌జడ్జితో విచారణ చేయాలి
- పౌరహక్కుల సంఘం నేతలు

ఏటూరునాగారం, డిసెంబర్ 22 : చెల్పాకలో ఈ నెల ఒకటిన జరిగిన ఎన్ కౌంటర్ బూటకమని, మావోయిస్టులను ముందుగా అదుపులోకి తీసుకుని అన్నంలో విషంపెట్టి చిత్రహింసలు గురిచేసి కాల్చి చంపారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక చంద్రశేఖర్ ఆరోపించారు. ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదివారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాకలో జరిగిన ఎన్‌కౌంటర్ స్థలాన్ని పౌరహక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ సందర్శించినట్టు తెలిపారు. ఇన్‌ఫార్మర్ సమాచారంతో అన్నంలో విషంపెట్టి, కాల్చి చంపినట్టు శవాలను చూస్తే అర్థమవుతుందన్నారు. వాగులోని ఇసుకలో నాలుగు మృతదేహాలు పడి ఉన్నాయని, డెన్ మీద అటాక్ చేస్తే వాగులో శవాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. గత ఏడాది కాలంలోనే రఘునాథపాలెం, దామెరతోగు, చెల్పాకలో ఎన్‌కౌంటర్లు జరిగి 16 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. దండకారణ్యంలో ఇప్పటి వరకు 217 మంది ఎన్ కౌంటర్లలో చనిపోయారని, వీటన్నింటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాము వస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు కొందరిని తమపైకి ఉసిగొల్పుతూ తమ దిష్టిబొమ్మలను దహనం చేయిస్తున్నారని ఆరోపించారు.

## 91% స్కూళ్లకు నో ఇంటర్నెట్

- కేవలం 9శాతం స్కూళ్లకే వసతి
- మన కన్నా ఛత్తీస్‌గఢ్ నయం
- జాతీయ సగటు కన్నా వెనుకంజలో రాష్ట్రం
- పైగా డిజిటల్, త్రీడీ పాఠాలంటూ అభూతకల్పనలు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 91శాతం సర్కారు స్కూళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్ లేదు. 9శాతం స్కూళ్లు మాత్రమే ఆ సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. 30,023 సర్కారు స్కూళ్లు ఉండగా, కేవలం 2,772(9.23శాతం) మాత్రమే ఇంటర్నెట్ కనెక్షన్లు కలిగి ఉన్నాయి. మన కన్నా గిరిజన రాష్ట్రాలైన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు రెండురెట్లు ముందంజలో ఉన్నాయి. జాతీయ సగటులో సగంశాతం స్కూళ్లకు కూడా రాష్ట్రంలో ఇంటర్నెట్ సౌకర్యంలేకపోవడం గమనార్హం. ఇదే విషయాన్ని ఇటీవలే ఓ పార్లమెంట్ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్రం పార్లమెంట్‌లో సమాధానమిచ్చింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోధన.. త్రీడీ పాఠాలు అంటూ ప్రచారం చేసుకుంటున్నది. అసలు ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా డిజిటల్ బోధన, త్రీడీ పాఠాలు ఎలా సాధ్యమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మధ్యాహ్న భోజనం వివరాలు, యూడైస్ అప్‌డేట్‌కు ఇంటర్నెట్‌యే మూలం. కానీ ఆయా సమాచారాన్ని ఆన్‌లైన్ చేరవేసేందుకు అవసరమైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడాన్ని మాత్రం విస్మరించారు.

### ప్రైవేట్‌లోనూ పూర్..

ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంలో ప్రైవేట్ స్కూళ్లు సైతం వెనుకబడే ఉన్నాయి. జాతీయంగా 3,35,844 స్కూళ్లు ఉండగా, 2,00,274 (59.63శాతం) ప్రైవేట్ స్కూళ్లు ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉన్నాయి. తెలంగాణలో12,193 ప్రైవేట్ స్కూళ్లుంటే, 6,917 (56.73%) స్కూళ్లు ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 26.31శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 57.57శాతం, బీహార్‌లో 43.14శాతం, ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ 36.50శాతం ప్రైవేట్ స్కూళ్లు ఇంటర్నెట్ సౌకర్యం కలిగిఉన్నాయి.

## సింగిల్ కోర్సుతోనే ఇంజినీరింగ్ కాలేజీలు

- కొత్త కాలేజీలకు ఏఐసీటీఈ గుర్తింపు గండం
- ఆర్థికశాఖ వద్ద నుంచి కదలని ఫైల్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : పేరుకు మాత్రం ఇంజినీరింగ్ కాలేజీ.. ఉండేది మాత్రం ఒక్క కోర్సు మాత్రమే. సీట్ల సంఖ్య 60 మాత్రమే. ఇది ఆరు కొత్త ఇంజినీరింగ్ కాలేజీల కథ. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఫైల్ ఆర్థిక శాఖ నుంచి ముందుకు కదలడంలేదు. దీంతో ఈ కాలేజీల మంజూరుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్తగా రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు విద్యాశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట, హైదరాబాద్ జిల్లాలోని మారేడుపల్లి, సికింద్రాబాద్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఓల్డ్‌సిటీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతాపూర్‌లోని పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వానికి ఇంజినీరింగ్ కాలేజీలు ప్రతిపాదనలు సమర్పించాయి. దీని కోసం ఈ కాలేజీలు ఏఐసీటీఈ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. గడువు డిసెంబర్ 9తో ముగిసింది. జరిమానాతో జనవరి 2 నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఈ లోపు ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇవ్వడం, ప్రభుత్వం కాలేజీలను ఏర్పాటు చేస్తూ జీవోలు జారీచేయాల్సి ఉంది. కొత్త కాలేజీలు కనీసం మూడు, నాలుగు కోర్సులతో కాలేజీని ప్రారంభిస్తేనే అవి మనుగడ సాగించే అవకాశముంటుంది. కానీ ఒకే ఒక